# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్ లో కేంద్ర భూ విజ్ఞాన శాఖ సహాయ  మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈరోజు నుంచి మూడు రోజులపాటు  పర్యటిస్తారు.**

3. **ప్రజా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.**

4. **తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలంగాణ నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **సంక్రాంతి రద్దీ దృష్ట్యా  6 వేల 432 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వెల్లడించింది..**

==========================

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఈరోజు 2025 ఆంగ్ల నూతన సంవత్సరానికి ఆనందోత్సాహాలతో స్వాగతం పలుకుతున్నారు. దేశ ప్రజలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ప్రధానమంత్రి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ... దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. నవభారత నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. ఈసందర్భంగా ఆకాంక్షించారు. దేశంలో శాంతి, ఆనందం నెలకొన్న సమాజాన్ని సృష్టించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ పేర్కొన్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిపథంలో ముందుకు సాగాలని, ఈ నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో సుఖశాంతులు తీసుకురావాలని గవర్నర్లు ఎస్. అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, విదేశాల్లోని తెలుగు వారందరికీ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఏ.రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర భూ విజ్ఞాన శాఖ సహాయ  మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ఈరోజు నుంచి మూడు

రోజులపాటు పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా వైయస్సార్ జిల్లాలోని సీకే దిన్నె మండలం నాగిరెడ్డిపల్లెకు చేరుకుంటారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాన్ని ఈరోజు సందర్శించి స్థానికులతో సమావేశమవుతారు. అనంతరం పెండ్లిమర్రి మండలం యల్లటూరులో ప్రకృతి వ్యవసాయం, ఫసల్‌బీమా యోజన లబ్ధిదారులతో సమావేశమై, ఉద్యాన పంటలను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. కేంద్రమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా అధికారుల తెలిపారు.

----------------------------

ప్రజా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని శారదానగర్‌లో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఫించన్‌ను నాలుగువేల రూపాయలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 20 సెకన్లు

----------------------------

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ లోక్ సభ స్థానం పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులపై హైదరాబాదులోని జలసౌధలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖలో పారదర్శకత విధానాలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 20 సెకన్లు

----------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 4వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. రైతు భరోసా, భూమిలేని పేదలకు నగదు, కొత్త రేషన్ కార్డులు, పర్యాటక విధానం, రైతు భరోసా వంటి అంశాలపై చర్చించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

----------------------------

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి దేశ వ్యాప్తంగా సంతాప దినాలు కొనసాగుతున్న దృష్ట్యా అధికారికంగా ఎలాంటి వేడుకలు చేపట్టవద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 1 తేదీ సాధారణంగానే విధులకు హాజరు కావాలని ఆదేశించింది. ఎప్పటి లాగే అధికారులు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను కలవొచ్చని వెల్లడించింది.

----------------------------

సంక్రాంతి రద్దీ దృష్ట్యా సొంతూళ్లకు వెళ్లే వారి కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –టిజిఎస్‌ఆర్టీసీ 6 వేల 432 ప్రత్యేక ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించింది. వీటిలో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించామని, జనవరి 9 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో

ఉంటాయని వెల్లడించింది. హైదరాబాద్ నుంచి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు టిజిఎస్ఆర్టీసీ తెలిపింది. కాకినాడ, పోలవరం, రాజమహేంద్రవరం, రాజోలు, ఉదయగిరి, విశాఖపట్నం, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం, తిరుపతి, తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయని పేర్కొంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుగు పయనమయ్యే వారి కోసం కూడా ప్రత్యేక బస్సులను సంస్థ ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును మంత్రి నిన్న పరామర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గాలివీడు పిడిఓపై దాడి ఘటనను ఖండిస్తున్నామని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉద్యోగులకు అండగా ఉంటామని పేర్కొంటూ...

వాయిస్ ...30 సెకన్లు

---------------------------

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైళ్ల ప్రయాణ వేళల్లో మార్పులు చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్పులు ఈరోజు నుంచి అమల్లోకి వస్తాయని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ స్టేషన్‌లో ఇక నుంచి 15 నిమిషాలు ముందుగానే బయలుదేరుతుందని తెలిపింది. విజయవాడలో ఉదయం 6 గంటల 15 నిమిషాలకు బయలుదేరాల్సిన రైలు.. మార్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 6 గంటలకే బయలుదేరుతుందని ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

ఈరోజు నుంచి ఎంఎంటీఎస్ రైళ్ల ప్రయాణ వేళల్లోనూ మార్పులు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ప్రయాణికుల సౌకర్యార్థం, కొత్తగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను అనుసంధానం చేసేందుకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు తెలిపింది. నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్‌లో మారిన ప్రయాణ వేళలు చూసుకోవచ్చని తెలిపింది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ క్రమంలో రానున్న మూడురోజుల పాటు ఉత్తరకోస్తాలో పొడి వాతావరణం ఉంటుందని.. దక్షిణ కోస్తాలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాయలసీమ జిల్లాల్లో కూడా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, మిగతా చోట్ల చలి తీవ్రత సాధారణంగా ఉండి.. పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది.

మరోవైపు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడంతో పాటు పలు ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

తెలంగాణలో ఈరోజు నుంచి రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ, రవాణాశాఖపై మంత్రి హైదరాబాద్ లో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో అపరిష్కృతంగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతా మాసం కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విజయవంతం చేసి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

======================